క్లుప్తంగా

రూ.300 కనీస వేతనం వచ్చేలా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

కొత్తపట్నం: రోజుకు రూ.300 కనీస వేతనంకు తగ్గకుండా పనిచేయాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేసి వేతనం రోజుకు రూ.300కు తగ్గకుండా తీసుకోవాలని చెప్పారు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గాదెపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద నీడ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగు నీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఏపీవో రత్నజ్యోత్స్నను ఆదేశించారు. అలాగే మస్టర్ల విషయంలో అవకతవకలు జరిగితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వడగాడ్పులు విపరీతంగా వీస్తున్నాయని, ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని పనిని వేగంగా చేసుకుని ఇంటికి చేరుకోవాలని సూచించారు జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఈసీ చంద్రశేఖర్ టీఏ అచ్చిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు కొప్పోలు రోడ్డులో విద్యుత్ అంతరాయం

ఒంగోలు రూరల్: స్థానిక కొప్పోలు రోడ్డులో మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒంగోలు రూరల్ ఏఈ జి.మల్లికార్జున తెలిపారు. అత్యవసరంగా విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొప్పోలు, రాజీవ్ గృహకల్ప కాలనీ, ఇందిరా కాలనీ, ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్

మద్దిపాడు: మండలంలోని అన్నంగి గ్రామ సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను సీజ్ చేశారు. మద్దిపాడు ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. ఆర్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కురిచేడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఎస్సీ విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ కె.ఆరోన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఈ నెల 28న దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలింగ్‌కు గతంలో ప్రవేశ పరీక్ష రాసి సీటు రానివారితో పాటు పరీక్షకు హాజరు కాని వారు కూడా తగిన ఆధారాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

- కార్పొరేట్ స్కూల్‌కు మించిన వసతులతో గుండాయపాలెం హైస్కూల్



గుండాయపాలెం హైస్కూల్



కారిడార్



హైస్కూల్లోని మినీ గ్రంథాలయం

ఒంగోలు రూరల్:

ప్రభుత్వ పాఠశాలలు అంటేనే చిన్నచూపు చూస్తూ తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ విద్యారంగంపై ప్రధాన దృష్టి సారించారు. అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు నాడు–నేడు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారు. అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. అందులో భాగంగానే ఒంగోలు మండలంలోని గుండాయపాలెం అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి మౌలిక వసతులన్నీ కల్పించి కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా తయారు చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గుండాయపాలెం పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు. హెచ్ఎం గది, ల్యాబ్, గ్రంథాలయం, మహిళా ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్ నిర్మించారు. ఆర్ఓ ప్లాంట్, స్త్రీ, పురుషులకు బాత్ రూంలు, విద్యార్థులకు వేరువేరుగా బాత్ రూంలు, స్టేజీ నిర్మించారు. బోర్ కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిధులతో పాటు స్థానికుల ఆర్థిక సహకారంతో పాఠశాల ముఖద్వారం, గార్డెనింగ్ వంటి అదనపు హంగులు సమకూరాయి. నాడు–నేడు రెండో దశలో భాగంగా పాఠశాలలో మరికొన్ని అభివృద్ధి పనులు ప్రారంభించారు. రెండువైపులా ఫస్ట్ ఫ్లోర్ నిర్మిస్తున్నారు. ఈస్ట్ బిల్డింగ్ నుంచి వెస్ట్ బిల్డింగ్‌కు వచ్చేందుకు స్లాబ్ నిర్మించారు. వంట గది, విశాలమైన గదుల నిర్మాణం పూర్తి చేశారు. కొరవ పనులు కూడా పూర్తిచేసుకుని ఇవన్నీ మరికొద్ది రోజుల్లోనే వినియోగంలోకి రానున్నాయి. విద్యా బోధనపై కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఉపాధ్యాయులు ఆ మేరకు ముందుకు సాగారు. అన్ని రకాలుగా ప్రభుత్వ పాఠశాల మెరుగుపడటంతో గుండాయపాలెం వాసులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపరాదని తీర్మానం చేసుకున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగి నో అడ్మిషన్ బోర్డు పెట్టే స్థాయికి పాఠశాల చేరింది.



స్టేజీ



స్టడీ క్లాసులకు ఓపెన్ ప్లేస్



నిర్మాణంలో ఉన్న ఫస్ట్ ఫ్లోర్



వాటర్ ప్లాంట్ గది

సెల్‌ఫోన్‌తో ప్రమాదం



చెట్ల పెంపకంపై ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు



ఎల్బీజీలో ఈజీ ఇంగ్లిష్ నేర్పిస్తున్న మాస్టర్లు

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆలోచింపజేసిన చిన్నారుల ప్రదర్శన
- ఎల్బీజీ భవనంలో సమ్మర్ క్యాంపులో ఈజీ ఇంగ్లిష్

ఒంగోలు టౌన్: ఇప్పుడు ఎవరి చేతుల్లో చూసినా సెల్‌ఫోన్ రింగుమంటోంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. సెల్‌ఫోన్ పుణ్యమా అని చదువుల్లో చిన్నారులు వెనకబడిపోతున్నారు. ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో సెల్‌ఫోన్ వలన ప్రమాదాలను వివరిస్తూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుని ఆలోచింపజేసింది. గత 11 రోజులుగా జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి సోమవారం 86 మంది విద్యార్థులు హాజరయ్యారు. సెల్‌ఫోన్‌తో ప్రమాదం, చెట్లను కాపాడుకుందాం అనే ప్రదర్శనలు నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లిష్, గణితం మాజిక్స్, మెదడు పనిచేసే విధానం గురించి చిన్నారులకు బోధించారు. తెలుగు పద్యాలు నేర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, జాలాది మోహన్, సీహెచ్ సుధాకర్‌రావు, ఎస్.షిర్డీసాయిరాం, దాసరి లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో ఇంగ్లిష్...

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్బీజీ భవనంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపు మూడో రోజుకు చేరుకుంది. ఆటపాటల రూపంలో సులభంగా ఇంగ్లిషు నేర్చుకునే విధానంలోని మెళకువలను ఉపాధ్యాయురాలు యామిని, భాస్కర్‌శాస్త్రి బోధించారు. ఈజీ ఇంగ్లిషు, ఫన్నీ గేమ్స్‌ను చిన్నారులకు అర్థమయ్యే రీతిలో టీచర్లు చెప్పడంతో చిన్నారుల్లో ఉత్సాహం కనిపించింది. అనంతరం సైన్స్ సరదా అనే అంశంపై మ్యాజిక్ నేర్పించారు. రామన్ మాస్టర్ మ్యాజిక్ రహస్యాల గుట్టు విప్పి చెప్పడంతో చిన్నారులు ఆశ్చర్యచకితులయ్యారు. ప్రజానాట్యమండలి నగర అధ్యక్షురాలు, గాయకురాలు ఇంద్రజ్యోతి విద్యార్థులకు పాటలు పాడటం నేర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ పర్యవేక్షించారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మండలంలోని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. ఒంగోలు మండలంలోని ఉలిచి ఎస్సీకాలనీలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 104 వాహనంలో గ్రామానికి చేరుకున్న ఆమె.. గతంలో వైద్య సలహాలు, వైద్యం అందజేసిన వృద్ధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వారు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగరాదని సూచించారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి గృహాలను సందర్శించి మందుల వాడకంలో హెచ్చుతగ్గులపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం కమిటీ హాలు సెంటర్ వద్ద ఓపీ నిర్వహించి 200 మందికిపైగా అవుట్ పేషంట్లకు చికిత్స అందజేశారు. తన మొబైల్ నంబర్ గతంలో ఇచ్చానని, లేని పక్షంలో ఆరోగ్య పరిస్థితిలో తీవ్ర మార్పులు ఉంటే ఏ సమయమైన స్థానిక ఏఎన్ఎంలను, సీహెచ్ఓలను సంప్రదించి వెంటనే ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు జయకుమారి, రజినికుమారి, 108 సిబ్బంది శ్రీనివాసరావు, మేల్ ఏఎన్ఎం శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్, స్కానింగ్ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



పూజలు అందుకుంటున్న స్వామివారు

ఒంగోలు మెట్రో: కళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వైశాఖ బహుళ పంచమి సోమవారం నుంచి శుక్రవారం వరకు పంచాహ్నిక వైఖానస ఆగమోక్త ప్రకారం వార్షికోత్సవాలకు శ్రీమాన్ వేదాంత శ్రీధరాచార్యులు వారి పర్యవేక్షణలో ఆగమశాస్త్రం ప్రకారం అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి రాజేష్ ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, తేనె, చక్కెర, కొబ్బరినీరు, పసుపు, కుంకుమ, గంధం సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలతో, వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ గావించి అర్చనాది కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన, ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు అంకురార్పణ, కలశ స్థాపన, భగవత్ ప్రార్థనతో భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన బూచేపల్లి



అక్షింతలు వేస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వల్లపునేని పెద్ద వీరయ్యచౌదరి మనవరాలు వెంకటరమణ శుభకార్యానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణను అక్షింతలు వేసి దీవించారు. వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వారి వెంట ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, వల్లపునేని వీరాచారి, చెన్నుబోయిన గురుమూర్తి, కాలూరి రమణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



పీ గుడిపాడు చెరువు వద్ద తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

చీమకుర్తి: తాగునీటి కోసం సాగర్ నీటిని అందించాలని కోరుతూ సంతనూతలపాడు మండలం పీ గుడిపాడు గ్రామానికి చెందిన మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం చెరువు వద్దకు వందల మంది మహిళలు చేరుకుని సాగర్ నీటిని తక్షణమే చెరువుకు నింపాలని కోరుతూ ఆందోళనకు దిగారు. చెరువులో నీరు లేకపోవడంతో చెరువు కింద ఉన్నటువంటి బావులు, బోర్లలో నీరు అడుగంటి తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. చెరువులో నీటిపై గొర్రెలు, పశువులు ఆధారపడ్డాయన్నారు. వెంటనే సాగర్ నీటిని విడుదల చేసి చెరువును నింపి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులతో పాటు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచాల పుష్ప, ఎంపీటీసీ టీ సుజాత, స్థానికులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం ఈదర అంకమ్మతల్లి



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

ముండ్లమూరు: మండలంలోని ఈదర అంకమ్మతల్లి 168వ వార్షికోత్సవం సోమవారం వైభంగా జరిగింది. ఈదర అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చడంతో భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచింది. ఈ సందర్భంగా మండలంలోని భీమవరం, అయోధ్యనగర్, కొమ్మవరం, బొప్పూడివారిపాలెం, రమణారెడ్డిపాలెం, వేములబండ, వేముల, పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఊయలు ఊపితే సంతానం లేని వారికి సంతానం కలుగుతారనే నమ్మకం ఉంది. దీంతో గతంలో కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు అన్నదానం చేశారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశాఖ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈదర సమస్యాత్మక గ్రామం కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్ట భద్రత చర్యలు తీసుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండల కేంద్రం తాళ్లూరు ఎస్టీ కాలనీలో సోమవారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన కార్డెన్ చర్చ్ కార్యక్రమంలో 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు. స్థానిక ఎస్టీ కాలనీలో సిబ్బందితో కలిసి విస్తృతంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ మోహనరావు, సిబ్బంది రాముడు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలతో పోలీసులు

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

నివాళులర్పించిన బూచేపల్లి



నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన ఎబ్బిలి నరసింహారావు గుండెపోటుతో మృతి చెందారు. నరసింహారావు మృతదేహానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా తనను కలవాలని సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.